సాక్షి
ములుగు

మంగళవారం | 2 | మే | 2023



సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి

విద్యుత్ సంస్థలు కష్టాల్లో ఉన్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఇంజనీర్లుగా మనపై ఉందని ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీసీరెడ్డి అన్నారు. - 8లో▸



సమీకృత చేపల పెంపకం చేపట్టాలి

వ్యవసాయానికి అనుబంధంగా రైతులు సమీకృత చేపల పెంపకం చేపట్టాలని మామునూరు కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న తెలిపారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
32.5^0 / 24.0^0

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉండటంతో పాటు పలు చోట్ల వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



ఏటూరునాగారం: నూతన సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేస్తూ సంతకాలు చేసినందుకు మండల కేంద్రంలోని ఆర్‌ఐటీఐ కళాశాలలో సీఎం కేసీఆర్ చిత్ర పటానికి లెక్చరర్లు సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఎంప్లాయీస్‌ను గుర్తించి తగిన న్యాయం చేసిన కేసీఆర్‌కు రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మువీన్, నరేష్, పాపారావు, సాధిక్, విక్రమ్, సమ్మయ్య, జాకీర్, కొండయ్య, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులను వినియోగించుకోవాలి



ఏటూరునాగారం: పెళ్లి, శుభకార్యాలకు ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకోవాలని ఆర్టీసీ ఏటూరునాగారం గ్రామ విలేజ్ ఆఫీసర్ చల్లా శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ప్రయాణికులకు బస్సు వినియోగంపై సోమవారం అవగాహన కల్పించారు. వరంగల్ 2 డిపో మేనేజర్ సురేష్ ఆదేశాల మేరకు బస్సుల వివరాలు, సమస్యలను పరిష్కరించనున్నట్లు వివరించారు. గ్రామాలకు వచ్చే బస్సులకు సంబంధించిన సమస్యలు, ఫిర్యాదులు, రాయితీ పథకాలు, పెళ్లిళ్లు, శుభకార్యాలకు బస్సులను అద్దెపై పొందుటకు విలేజ్ బస్సు ఆఫీసర్‌గా తనను నియమించినట్లు తెలిపారు. మరింత సమాచారానికి సెల్ నంబర్ 7382852670లో సంప్రదించాలని కోరారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ప్రొఫెసర్ చిన్న



ఏటూరునాగారం: ఏటూరునాగారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ కామర్స్ ప్రొఫెసర్ చిన్నను తెలంగాణ ప్రభుత్వ కళాశాల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో తెలంగాణ ప్రభుత్వ కళాశాల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో డాక్టర్ కె. సురేందర్ రెడ్డి ప్యానల్ తరఫున ఆయన అత్యధిక మెజారిటీతో గెలిచి విజయాన్ని సాధించారు. ఈ సందర్భంగా జిల్లా సంఘం బాధ్యులు , అధ్యక్షుడు ఎండి యాకూబ్, కార్యదర్శి రవీందర్, వివిధ కళాశాలల సంఘం బాధ్యులు, కళాశాల ప్రిన్సిపాల్ రాములు, అధ్యాపకులు చిన్నకు అభినందనలు తెలిపారు.

పంటనష్టం అంచనాలో అధికారుల నిర్లక్ష్యం




వెంకటాపురం(ఎం): అకాల వర్షాలతో పంటలు నష్టపోయి రైతులు అల్లాడుతుంటే, పంట నష్టాన్ని అంచనా వేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి ఆరోపించారు. మండల పరిధిలోని సర్వాపూర్, పాపయ్యపల్లి, సింగరకుంటపల్లి గ్రామాల్లో నష్టపోయిన వరిపంటను బీజేపీ మండలాధ్యక్షుడు భూక్య జవహర్‌లాల్ ఆధ్వర్యంలో సోమవారం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ అకాల వర్షాలతో వేలాది ఎకరాల్లో వరి, మిరప, పుచ్చ, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయన్నారు. దెబ్బతిన్న ప్రతీపంటకు ప్రభుత్వం పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిరికొండ బలరాం, జినుకల కృష్ణాకర్‌రావు, నగరపు రమేష్, వాసుదేవారెడ్డి, ప్రేమ్‌సింగ్, గొల్లపెల్లి రవి, శ్రీనివాస్, రాజిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, ఓదేలు, సదయ్య, వీరయ్య, భద్రయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షానికి వెంకటాపురం(ఎం) శివారులో నేలవాలిన వరిపంట



ఆగమాగం

వారం రోజులుగా దంచి కొడుతున్న వానలు
- పంటలను కాపాడుకోలేక ఇబ్బందులు పడుతున్న రైతులు
- వేలాది ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- కొనసాగుతున్న పంటనష్టం సర్వే



నీటిలో మునిగిపోయిన వరిపంట

వెంకటాపురం(ఎం): అకాల వర్షాలతో అన్నదాతలు ఆగమాగమవుతున్నారు. పగలు ఎండ, రాత్రిపూట కురుస్తున్న వర్షంతో రైతన్నలు అయోమయానికి గురవుతున్నారు. ఆరుగాలం శ్రమించి వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పండించిన పంటలు చేతికందే సమయంలో నీటి పాలవుతుండడంతో రైతన్నలు కన్నీటి పర్యంతమవుతున్నారు. పంటలను కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నా ఫలితం లేకుండా పోతోంది.

జిల్లాలోని 9 మండలాల పరిధిలో యాసంగిలో 89 వేల ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగు చేశారు. 55,460 ఎకరాల్లో వరిపంట, 26,346 ఎకరాల్లో పత్తిపంట, 4,410 ఎకరాల్లో మొక్కజొన్న, మరో 2,700 ఎకరాల్లో పెసర్లు, వేరుశనగ, మినుములు, నువ్వులు, బబ్బెర, పొద్దు తిరుగుడు తదితర పంటలను సాగు చేశారు. పత్తి పంట ఎలాంటి ఇబ్బంది లేకుండా సకాలంలో రైతుల చేతికి వచ్చింది. వరిపంట చేతికందే సమయంలో కురుస్తున్న వర్షాలతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

సుమారు 15 వేల ఎకరాల్లో వరిపంట నష్టం

ఇటీవల కురుస్తున్న అకాలవర్షాలతో జిల్లా వ్యాప్తంగా సుమారు 15 వేల ఎకరాల్లో వరిపంటకు నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి రూ.16 వేల నుంచి 18 వేల వరకు పెట్టుబడి పెట్టి పంటలను పండిస్తే చివరకు మిగిలేదేవిలేదని రైతులు వాపోతున్నారు. 15 రోజులుగా వరికోతలను రైతులు ప్రారంభించారు. కేవలం 10శాతం మాత్రమే కోతలు పూర్తవ్వగా ఆ ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోశారు. కొనుగోలు కేంద్రాలు సైతం సకాలంలో ప్రారంభం కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కోతకు వచ్చిన వరి పంటలు నేలవాలుతుండగా, కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం వర్షంలో తడిసి మొలకెత్తుతుందని రైతులు వాపోతున్నారు. నష్టపోయిన పంటలకు ఎకరానికి రూ.15వేల చొప్పున పరిహారం అందించాలని బాధిత రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కొనసాగుతున్న సర్వే

ఇటీవల కురుస్తున్న వర్షాలతో దెబ్బతిన్న పంటలను క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు సర్వే చేస్తూ ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నారు. డీఏఓ గౌస్ హైదర్ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా ఏటూరు, ఏటూటూ గ్రామాల్లో పంటలను పరిశీలిస్తూ పంటనష్టం వివరాలను సేకరిస్తున్నారు. ములుగు, వెంకటాపురం(ఎం) మండలాల్లో మాత్రమే పెద్ద ఎత్తున వరిపంట, కొద్ది మొత్తంలో మిరప పంట దెబ్బతిన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. మిగిలిన మండలాల్లో పంటలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని వ్యవసాయ అధికారులు ప్రభుత్వానికి నివేదించినట్లు సమాచారం.

10 ఎకరాల్లో వరిపంట నేలవాలింది..



యాసంగిలో 18ఎకరాల్లో వరిపంటను సాగు చేశాను. 13 ఎకరాల భూమి ఉండగా మరో 5 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని పంటను సాగుచేశాను. 18 ఎకరాల పంటకు సుమారు రూ.3 లక్షలు పెట్టుబడి పెట్టాను. అకస్మాత్తుగా కురుస్తున్న వర్షాలతో ఇప్పటికే 10 ఎకరాల్లో వరిపంట నేలవాలింది. ధాన్యం మొలకెత్తే అవకాశాలు ఉన్నాయి. నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం అందించి రైతాంగాన్ని ఆదుకోవాలి.

- రెడ్డి శంకర్, రైతు వెంకటాపురం (ఎం)

33శాతం పంటలు దెబ్బతింటేనే పరిహారం



ఇటీవల కురుస్తున్న వర్షాలతో దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అధికారులతో సర్వే చేపిస్తున్నాం. క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు పంటలను పరిశీలిస్తూ దెబ్బతిన్న పంటల వివరాలను సేకరిస్తూ ప్రభుత్వానికి నివేదిస్తున్నారు. ఇప్పటి వరకు 3,680 ఎకరాల్లో వరిపంట దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించాం. జిల్లాలో ఇంకా పంట నష్టం సర్వే కొనసాగుతోంది. 33శాతం కంటే ఎక్కువ దెబ్బతిన్న పంటలకు మాత్రమే పరిహారం అందుతుంది.

- గౌస్ హైదర్, జిల్లా వ్యవసాయ అధికారి ములుగు

మంత్రి కేటీఆర్ పర్యటన షెడ్యూల్ విడుదల

ఏర్పాట్లపై మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమీక్ష



సమీక్షలో పాల్గొన్న మంత్రి దయాకర్‌రావు, కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, ఎమ్మెల్యేలు, అధికారులు

సాక్షిప్రతినిధి, వరంగల్: రాష్ట్ర మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా చేపట్టనున్న ఏర్పాట్లపై సోమవారం హనుమకొండలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేలు అరూరి రమేష్, వొడితెల సతీష్‌కుమార్, మేయర్ గుండు సుధారాణి, వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, ప్రావీణ్య, అధికారులతో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమీక్షించారు. ఈనెల 5న వరంగల్ పర్యటనకు రానున్నారని, ఈ సందర్భంగా నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారన్న దయాకర్‌రావు షెడ్యూల్ ప్రకటించారు.

- ఉదయం 10 గంటలకు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొంటారు.
- మధ్యాహ్నం.3 గంటలకు హసన్‌పర్తి(ఎర్రగట్టు గుట్ట) కిట్స్ కళాశాలలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొని.. ఇంక్యుబేషన్ సెంటర్‌ను ప్రారంభించి, అక్కడ ఏర్పాటు చేసిన ఎగ్జిబిట్స్ తిలకిస్తారు. అనంతరం హెచ్‌ఓడీలు, విద్యార్థులతో ఏర్పాటు చేసిన ముఖాముఖిలో పాల్గొంటారు.
- సాయంత్రం4 గంటలకు హసన్‌పర్తి బాలాజీ గార్డెన్స్‌లో కేసీఆర్ కప్ బహూకరణ కార్యక్రమం ఉంటుంది.
- 4.30 గంటలకు హనుమకొండ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం.
- 5.30 గంటలకు హంటర్ రోడ్‌లోని సైన్స్ సెంటర్, 5.50 గంటలకు లష్కర్ బజార్ మర్కజీ స్కూల్లో నగరంలోని వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారు.
- 6.15 గంటలకు గాంధీనగర్‌లో(అంబేడ్కర్ భవన్, టీవీ టవర్ దగ్గర) మోడల్ వైకుంఠ ధామం ప్రారంభోత్సవం చేస్తారు.
- 6.45 గంటలకు సెయింట్ గాబ్రియల్ స్కూల్లో పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు.

బ్రహ్మోత్సవాలు షురూ..



ఉత్సవ మూర్తులకు స్నపనం కార్యక్రమం



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న యాగ్నికులు

మంగపేట: మండల పరిధిలోని మల్లూరు హేమాచల క్షేత్రంలో లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలను భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ ఉప ప్రధానార్చకులు అమరవాది జగన్నాథాచార్యుల యాగ్నికుల బృందం సోమవారం ప్రారంభించారు. ఈ నెల 10వ తేదీన జరుగనున్న తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు(జాతర) మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రావణం సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆలయంలోని లక్ష్మీనర్సిహస్వామికి ఉదయం 6గంటల నుంచి నిత్య ఆరాధన, విశ్వక్సేనపూజ, వాసుదేవ పుణ్యాహవచన, పరిషత్ దక్షిణ, రక్షాబంధనం, రుత్విక్‌వరణం, నవకలశ స్నపనం, మధ్యాహ్నం ఉత్సవమూర్తులకు కల్యాణ మండపంలో ఆరాధన ఉత్సవాంగ స్నపనం, మహానివేదన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు యాగశాలలో పునపూజా భగవత్ ఆరాధన, ఉత్సంగ్రహణం అంకురార్పన, వాస్తు హోమం, నీరాజన మంత్రపుష్పం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ ముకుందం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ, యాగ్నికులు మధనమోహనాచార్యులు, పవనకుమార్ ఆచార్యులు, భాస్కరాచార్యులు, శ్రీరంగం వెంకటాచార్యులు. భరదావజాచార్యులు, రమాచార్యులు ఆలయ ప్రధాన పూజారులు కైంకర్యం రాఘవాచార్యులు. రాజీవ్ నాగశర్మ, పవన్‌కుమార్ ఆచార్యులు, ఆలయ సీనియర్ అసిస్టెంట్ సీతారాములు, శేషు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులు హక్కులను కాపాడుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి మాధవి

- సీనియర్ సివిల్ జడ్జి మాధవి

ములుగు: కార్మికులు తమ హక్కులను కాపాడుకోవాలని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టి.మాధవి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆర్టీసీ కార్మికులు, ఆటో యూనియన్ కార్మిక సంఘాల నాయకుల ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ కార్మికుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్జి మాధవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల గురించి ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని జడ్జి కార్మికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ములుగు అదనపు జూనియర్ సివిల్ జడ్జి సౌక్య, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వి.వినోద, ములుగు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వేణుగోపాలచారి, న్యాయవాదులు చంద్రయ్య, కె.సునీల్‌కుమార్, బి.స్వామిదాస్, ఆర్టీసీ కంట్రోలర్, బస్ డ్రైవర్లు, ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వినతులు త్వరితగతిన పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు: ప్రజావాణి వినతులు త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఇలా త్రిపాఠి సూచించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె వినతులను స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వివిధ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న అర్జీలను పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో ధరణి సమస్యలపై 4, డబుల్ బెడ్ రూం ఇళ్లు 3, పెన్షన్ 1, ఇతర సమస్యలపై 8 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. ఉద్యోగులు తప్పని సరిగా ములుగు -వెలుగు యాప్‌లో హాజరు నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) వైవీ. గణేశ్, డీఆర్‌ఓ రమాదేవి, జెడ్పీ సీఈఓ ప్రసూన, జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడి తుల రవి, సీపీఓ ప్రకాశ్, బీసీ వెల్ఫేర్ అధికారి లక్ష్మణ్, డీసీఓ సర్దార్, డీఈఓ పాణిని, డీఎస్‌ఓ అరవింద్ కుమార్‌రెడ్డి, డీపీఓ వెంకయ్య, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఇలా త్రిపాఠి



పీఓ అంకిత్‌కు వినతులు ఇస్తున్న గిరిజనులు

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి

ఏటూరునాగారం: గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వినతులను పీఓ స్వీకరించారు. వివిధ మండలాల నుంచి వచ్చిన 7 దరఖాస్తులను పరిశీలించారు. వెంకటాపురం(కె) మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన చెరుకుల నాగమ్మ తన భర్త పుల్లయ్య మృతి చెందడంతో కుటుంబ పోషణ భారంగా ఉందని ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో స్వీపర్ పోస్టును ఇప్పించాలని వేడుకున్నారు. కొత్తగూడ మండలం మోకాళ్లపల్లికి చెందిన పత్తి రమేష్ తన ఇల్లు ఇటీవల కురిసిన వర్షానికి కూలిపోయిందని తనకు ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఏటూరునాగారం మండలంలోని చిన్నబోయినపల్లి గ్రామానికి చెందిన రైతు ఎట్టి బాబు ఆర్‌ఓఎఫ్‌ఆర్ హక్కు పత్రం ఉన్నప్పటికీ ఫారెస్ట్ అధికారులు సాగులో ఉన్నటువంటి భూమిని సాగు చేస్తే కేసులు పెడతామని ఇబ్బంది పెడుతున్నారని న్యాయం చేయాలని వేడుకున్నారు. ఇలా పలు సమస్యలపై వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఏపీఓ వసంతరావు, డీడీ పోచం, ఏఓ దామోదరస్వామి, ఎస్‌ఓ రాజ్ కుమార్, పీహెచ్‌ఓ రమణ, ప్రాజెక్ట్ అగ్రికల్చర్ ఆఫీసర్ భారతి, జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, ఆర్‌సీఓ రాజ్యలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ క్రాంతికుమార్ తదితర శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన తప్పనిసరి

ఐటీడీఏ పీఓ అంకిత్



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ అంకిత్

ఏటూరునాగారం: క్యాన్సర్‌పై ప్రజలు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఐటీడీఏ పీఓ అంకిత్ సూచించారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో జిల్లా వైద్యాధికారి అప్పయ్య ఆధ్వర్యంలో ప్రతిమ క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు క్యాన్సర్‌పై ఏఎన్‌ఎంలు, సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు అవినాష్, ప్రతీక్, ప్రియాంక, ఆస్పత్రి ఇన్‌చార్జ్ మహంతిలు మాట్లాడారు. నోటి, రొమ్ము, గర్భసంచి ముఖద్వారా, ఊపిరితిత్తులకు వచ్చే క్యాన్సర్‌ను గుర్తించడంపై వివరించారు. క్యాన్సర్ లక్షణాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వైద్య సిబ్బందికి వివరించారు. అనంతరం పీఓ అంకిత్ మాట్లాడుతూ ఏజెన్సీ మండలాల్లో క్యాన్సర్ పైన అవగాహన కల్పించి ముందుగా అలాంటి రోగులను గుర్తించి వైద్యుల వద్దకు పంపించడానికి సహకరించిన ప్రతిమ ఇన్స్టిస్ట్యూట్ ఆఫ్ క్యాన్సర్ యజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. వ్యాధి నివారణ చాలా ముఖ్యమైనదని తెలిపారు. అనంతరం డీఎంహెచ్‌ఓ అప్పయ్య మాట్లాడుతూ ప్రతీ ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు తమ పరిధిలో గల జనాభాలో 35 సంవత్సరాలు పైబడిన స్త్రీలకు ఎవరికైనా క్యాన్సర్ లక్షణాలు అనుమానంగా ఉంటే వారి జాబితా తయారుచేసి పీహెచ్‌సీ వైద్యాధికారికి ఇవ్వాలని సూచించారు. ఇంటింటా సర్వే కార్యక్రమం చేపట్టి 10వ తేదీ లోపు పూర్తి చేయాలని అప్పయ్య కోరారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్వర్లు, వైద్యులు నిఖిల్ కుమార్, నరేష్, యమునా, స్వప్నిత, సుమలత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువులు, క్రీడల్లో రాణించాలి

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల, పీఎంహెచ్ హాస్టల్‌లోని డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉద్యోగాలు సాధించేలా మెలకువలు నేర్పించారు. అనంతరం పీఓ అంకిత్ మాట్లాడారు. ప్రణాళికతో ముందుకు సాగితే ఉద్యోగం వస్తుందన్నారు. డిగ్రీ విద్యార్థులు పోటీ పరీక్షలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. గిరిజన విద్యార్థుల ప్రయోజనాన్ని ఆశించి మహబూబాబాద్, మరిపెడ, జనగామ ప్రాంతాల్లో సదస్సులను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్‌సీఓ రాజ్యలక్ష్మి, పీఈటీసీ ప్రిన్సిపాల్ శ్రీరాములు, రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుంటే నేరం



క్లినిక్‌కు నోటీసు ఇస్తున్న విపిన్

ములుగు రూరల్(గోవిందరావుపేట): అనుమతులు లేకుండా మెడికల్ ప్రాక్టీస్ చేయడం నేరమని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విపిన్ అన్నారు. గోవిందరావుపేట మండల పరిధిలోని పస్రాలో మెడికల్ క్లినిక్‌లు, ల్యాబ్‌లను డీఎంహెచ్‌ఓ అప్పయ్య ఆదేశాల మేరకు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకుండా ల్యాబ్‌లు ఏర్పాటు చేసి ఆర్‌ఎంపీ వైద్యులతో టెస్టులు రాయించి ప్రజలను దోపిడీకి గురి చేస్తున్నారని ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు తనిఖీలు నిర్వహించామని తెలిపారు. మెడికల్ క్లినిక్‌లు, ల్యాబ్‌లను వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నోటీసులు జారీ చేశామని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతయ్య, దుర్గారావు, సంపత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు పరీక్షలు చేయించుకోవాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ గణేశ్

అదనపు కలెక్టర్ వైవీ.గణేశ్

ములుగు: లేబర్ కార్డు కలిగిన కార్మికులు ఉచిత ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని అదనపు కలెక్టర్ వైవీ.గణేశ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని రైతు వేదికలో కార్మికశాఖ ఆధ్వర్యంలో కార్మికుల ఆత్మీయ సంబరాలను జిల్లా కార్మికశాఖ అధికారి వినోద ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్మిక శాఖ ఆధ్వర్యంలో కార్మికులకు అందుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్మికులు తప్పనిసరిగా గుర్తింపు కార్డులను పొందాలని వాటి ద్వారా కార్మికులకు ఆరోగ్య, ప్రమాద బీమా సౌకర్యం ఉంటుందన్నారు. నేడు, రేపు ఉచిత వైద్య శిబిరం పంచాయతీ కార్యాలయంలో కొనసాగుతుందని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ పల్లా బుచ్చయ్య, గ్రంథాలయ చైర్మన్ గోవింద్‌నాయక్, ఎక్సైజ్ ఎస్సై వెంకన్న చందు, ఏఐటీయూసీ నాయకులు జంపాల రవీందర్, డిప్యూటీ డీఆర్‌డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సత్యనారాయణస్వామి, కార్మిక సంఘం నాయకులు అశోక్, నర్సింగం, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తల్లి అంత్యక్రియలకు వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల!

● రూ.8 లక్షల విలువైన బంగారు ఆభరణాల అపహరణ

గీసుకొండ: తల్లి అంత్యక్రియలకు వెళ్లొచ్చేసరికి గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ గొర్రెకుంట జయశంకర్‌కాలనీకి చెందిన బండారి విక్రమ్ ఇంట్లో చోరీ జరిగింది. తాళం పగులగొట్టి సుమారు 14 తులాల బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. గత నెల 13న విక్రమ్ తల్లి చెన్నారావుపేట మండలం గురిజాలలో చనిపోయింది. దీంతో కుటుంబమంతా ఇంటికి తాళం వేసి గురిజాలకు వెళ్లింది. అనంతరం తల్లి అంత్యక్రియలు, దశదిన ఖర్మ లాంఛనాలు పూర్తి చేసుకోగా.. విక్రమ్ తన కూతురును గత నెల 30న ఇంటికి పంపించాడు. ఆమె ఇంటివద్దకు వచ్చి చూడగా తలుపు తాళం పగులగొట్టి ఉండడంతో విషయాన్ని తండ్రికి ఫోన్‌లో చెప్పింది. అతడు అక్కడికెళ్లి 100కు డయల్ చేశాడు. ఇంటిలో డ్రెస్సింగ్ టేబుల్, బీరువా తాళాన్ని పగులగొట్టి అందులోని బట్టలు, పర్సులను పడేసి దొంగలు నగలు ఎత్తుకెళ్లారు. మొత్తం ఏడు రకాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు వాటి విలువ రూ.8 లక్షలు ఉంటుందని బాధితులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలాన్ని గీసుకొండ ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు, ఎస్‌ఐ సందీప్‌కుమార్ సందర్శించి వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

చెట్టును ఢీకొట్టిన కారు



కాళేశ్వరం: కాళేశ్వరంలోని ముక్తివనం పార్కు వద్ద సోమవారం కోతులను తప్పించబోయి చెట్టును కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. సోమవారం జిల్లాలోని జంగేడు గ్రామానికి చెందిన ఓదెల రమేశ్ తన కుటుంబ సభ్యులతో కలిసి కాళేశ్వరం వచ్చాడు. దర్శనం అనంతరం తిరుగు ప్రయాణమయ్యాడు. ముక్తివనం పార్కు వద్ద కోతుల గుంపు రోడ్డుపై అడ్డు రావడంతో తప్పించబోయి కారు చెట్టును ఢీకొట్టింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న రమేశ్‌కు ముక్కు, ఛాతిలో గాయాలయ్యాయి. అతడి కుమార్తె శ్రీనిజ తలకు గాయమైంది. అతడి భార్య, అల్లుడు, ఇద్దరు పిల్లలకు ఎలాంటి గాయాలు కాలేదు. దీంతో చెట్టుకు బలంగా ఢీకొట్టడంతో ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో సురక్షితంగా బయటపడ్డట్లు స్థానికులు తెలిపారు. వెంటనే అంబులెన్స్ మహదేవపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు.

‘సాక్షి’ మాక్ ఎంసెట్‌కు విశేష స్పందన

● ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు



సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ ఎంసెట్‌లో పాల్గొన్న విద్యార్థులు

కాజీపేట రూరల్: సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాక్షి ఇంజనీరింగ్ మాక్ ఎంసెట్‌కు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. కాజీపేట సోమిడి శివారులోని తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం సాక్షి మాక్ టెస్ట్ జరిగింది. విద్యార్థులను ప్రోత్సాహిస్తూ, ఒత్తిడి తగ్గించి ఎంసెట్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించేందుకు సాక్షి నిర్వహించిన మాక్ టెస్ట్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని ఆన్‌లైన్‌లో ఈపరీక్ష రాశారు. ఈ సందర్భంగా సాక్షి జిల్లా బ్రాంచ్ మేనేజర్ వి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడంలో సాక్షి ఎప్పుడూ ముందుంటుందన్నారు. ఇలాంటి పరీక్షలను విద్యార్థులు ఉపయోగించుకుని వారి ప్రతిభా పాటవాలను పరీక్షించుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఈవెంట్ మేనేజర్ ఎస్.సుమన్, సాక్షి బ్యూరో చీఫ్ జి.రాజిరెడ్డి, తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం, కాలేజ్ డైరెక్టర్ తాళ్ల వంశీ, ప్రిన్సిపాల్ డాక్టర్ వేలు సీనియర్ లెక్చరర్ మేథమెటిక్స్ కె.సాంబశివుడు, రాధాకృష్ణ అకాడమీ డైరెక్టర్ మనోహర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన వచ్చింది



సాక్షి నిర్వహించిన మాక్ ఎంసెట్‌తో ఒక అవగాహన వచ్చింది. పరీక్ష రాసే విధానం, అడిగిన ప్రశ్నల తీరుపై, సమయం కేటాయింపు అంశాలను తెలుసుకోగలిగా. ఆన్‌లైన్ పరీక్ష విధానంపై అవగాహనతో పాటు ఆందోళన తగ్గింది. భవిష్యత్‌లో ఎలాంటి పరీక్షలైనా సమర్థంగా రాయాలనే ధైర్యం వచ్చింది.

- ప్రజ్వల్, విద్యార్థి

ప్రశ్నల తీరు తెలిసింది..



సాక్షి నిర్వహించిన మాక్ ఎంసెట్ పరీక్ష విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. నేను పరీక్ష బాగా రాశాను. మాక్ టెస్ట్‌లో ప్రశ్నలు అడిగిన తీరుపై అవగాహన వచ్చింది. సాక్షి మీడియా భవిష్యత్‌లో ఇలాంటి పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు బాసటగా నిలువాలని కోరుకుంటున్నా.

- సుప్రియ, విద్యార్థిని

సాక్షి మాక్ టెస్ట్‌లు ఉపయోగకరం



సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాక్ టెస్ట్‌లు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఇలాంటి మాక్ టెస్ట్‌లు మరిన్ని నిర్వహించి విద్యార్థుల భయాందోళనను తీసి వేసి ప్రోత్సాహించాలి. ఈ మాక్‌టెస్ట్ కార్యక్రమానికి మా కళాశాల వేదికైనందుకు ఆనందంగా ఉంది.

- తాళ్ల మల్లేశం, తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్

కార్మికులకు అండగా బీఆర్‌ఎస్



బీఆర్‌ఎస్ కార్మిక విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన మే డే వేడుకల్లో మంత్రి దయాకర్‌రావు

● కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్రం
● రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు: సంపదను సృష్టిస్తున్న కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలో బీఆర్‌ఎస్ కార్మిక విభాగం, ఏఐటీయూసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన మే డే వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రతా పథకం, చేనేత, బీడీ కార్మికులు, గీత కార్మికులకు బీమా, సబ్సిడీలు, పాడుపు పథకం అమలు చేస్తోందన్నారు. ఆటో, ట్రాక్టర్ కార్మికులకు ట్యాక్స్‌లు రద్దు చేసిందని, ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికుడికి రూ.5 లక్షల ఉచిత బీమా సౌకర్యం ప్రభుత్వం కల్పించిందన్నారు. బీజేపీ పాలిత 16 రాష్ట్రాల్లో బీడీలు చేసే కార్మికులను పట్టించుకోలేదన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ ప్రజలపై పన్నుల భారం మోపుతోందన్నారు. కార్మికులంతా ఐక్యంగా ఉండి కేంద్ర ప్రభుత్వ మెడలు వంచాలన్నారు. బీఆర్‌ఎస్ సర్కార్ హయాంలో కార్మికులు సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు తమ్మెర విశ్వేశ్వరరావు, ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ లింగాల వెంకటనారాయణగౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఆర్బీఎస్ మండల కో–ఆర్డినేటర్ అనుమాండ్ల దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిల బదిలీలు, నియామకాలు

వరంగల్ లీగల్: రాష్ట్రవ్యాప్తంగా జరిగిన జూనియర్ సివిల్ జడ్జిల బదిలీలు, నియామకాలు జారీ చేస్తూ హైకోర్టు అధికారిక వర్గాలు ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నలుగురు జూనియర్ సివిల్ జడ్జిలు ఇతర జిల్లాలకు బదిలీ కాగా.. ఒక జడ్జికి ఇదే జిల్లాలో స్థాన చలనం జరిగింది. ఇతర జిల్లాల నుంచి ఆరుగురు జూనియర్ సివిల్ జడ్జిలను వరంగల్ ఉమ్మడి జిల్లాలో నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

బదిలీ అయిన వారిలో..

హనుమకొండ ఫస్ట్ ఎంఎం కోర్టు జడ్జి పి.గోపిక నాగశౌర్య ఖమ్మం పీడీఎం కోర్టు జడ్జిగా బదిలీ అయ్యారు. హనుమకొండ నాలుగో ఎంఎం కోర్టు జడ్జి మట్ట సరిత తొర్రూరు కోర్టుకు బదిలీ అయ్యారు. హనుమకొండ పీడీఎం కోర్టు జడ్జి రాపోలు అనిత సంగారెడ్డి జిల్లా సెకండ్ ఎంఎం మొబైల్ కోర్టు జడ్జిగా బదిలీ అయ్యారు. కాజీపేట రైల్వే కోర్టు జడ్జి షేక్ ఆరీఫ్ నల్గొండ జిల్లా తుంగతుర్తి కోర్టుకు బదిలీ కాగా.. జనగామ పీడీఎం కోర్టు జడ్జి డి.టి పృథ్వీరాజ్ రంగారెడ్డి జిల్లా కూకట్‌పల్లి పీడీఎం కోర్టు జడ్జిగా బదిలీ అయ్యారు.

ఉమ్మడి జిల్లాకు బదిలీపై వస్తున్న జూనియర్ సివిల్ జడ్జిలు

వరంగల్ ఫస్ట్ ఎంఎం కోర్టు జడ్జిగా ఖమ్మం పీడీఎం కోర్టు జడ్జి ఎస్వీ హైమ పూజిత బదిలీపై వస్తున్నారు. హనుమకొండ జిల్లా పీడీఎం కోర్టు జడ్జిగా ఖమ్మం ఫస్ట్ ఎంఎం కోర్టు జడ్జి ఎస్.శాంతిసోని, హనుమకొండ ఫస్ట్ ఎంఎం కోర్టు జడ్జిగా ఖమ్మం జిల్లా సత్తుపల్లి పీడీఎం కోర్టు జడ్జి సీహెచ్ శ్రావణస్వాతి బదిలీపై వస్తున్నారు. హనుమకొండ థర్డ్ ఎంఎం కోర్టు జడ్జిగా సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పీడీఎం కోర్టు జడ్జి ప్రియాంక సిరిసిల్ల, జనగామ పీడీఎం కోర్టు జడ్జిగా రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని పీడీఎం కోర్టు జడ్జి ఈ.సుచరిత బదిలీపై రానున్నారు. మహబూబాబాద్ పీడీఎం కోర్టు జడ్జిగా ఖమ్మం సెకండ్ ఎంఎం కోర్టు జడ్జి పి.మౌనిక బదిలీపై రానున్నారు.

సమీకృత చేపల పెంపకం చేపట్టాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న

కరీమాబాద్: వ్యవసాయానికి అనుబంధంగా రైతులు సమీకృత చేపల పెంపకం చేపట్టాలని మామునూరు కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న అన్నారు. జాతీయ మత్స్య అభివృద్ధి మండలి, మామునూరు కేవీకే, పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఐదు రోజుల శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. చేపల పెంపకంలో భారత దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మూడో స్థానంలో ఉందని చెప్పారు. చేపల మాంసం మంచి పోషకాహారం అని చెబుతూ అందులో ఒమేగా ఫ్యాటీ ఆసిడ్స్ కూడా అధికంగా ఉంటాయన్నారు. చేపల పెంపకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాలేరు మత్స్య పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ యం.శ్యాంప్రసాద్ మాట్లాడుతూ.. తెలంగాణలో చేపల పెంపకానికి అనువైన నేలలున్నాయని తెలిపారు. చేపల పెంపకంలో యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ గణేశ్, డాక్టర్ రాజు, డాక్టర్ శశాంక్, డాక్టర్ సాయికిరణ్, రైతులు పాల్గొన్నారు.

సామాజిక దృక్పథమున్న కవిత్వంతో చైతన్యం

● ఘనంగా ‘వెలుగు రవ్వలు’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ శ్రీకృష్ణదేవరావు

హన్మకొండ కల్చరల్: సామాజిక దృక్పథం కలిగిన కవిత్వం సార్వజనీనమై ప్రజలను చైతన్య పరుస్తుందని, సాహిత్యానికి సమాజాన్ని సంస్కరించే శక్తి ఉందని నల్సార్ న్యాయశాస్త్ర విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ పెండ్యాల శ్రీకృష్ణదేవరావు అన్నారు. సర్వోదయ ఆర్గనైజేషన్ సహకారంతో సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ కవి, న్యాయవాది, సహృదయ సంస్థ ఉపాధ్యక్షులు మల్యాల మనోహరరావు రచించిన వచన కవితా సంపుటి ‘వెలుగు రవ్వలు’ పుస్తకావిష్కరణ ఘనంగా జరిగింది. ఆదివారం రాత్రి హనుమకొండలోని హోటల్ హరిత కాకతీయలో సహృదయ సంస్థ అధ్యక్షులు మనోహరబాబు అధ్యక్షతన జరిగిన ఈసభలో ముఖ్య అతిథిగా శ్రీకృష్ణదేవరావు పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న కేయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బన్న అయిలయ్య మాట్లాడుతూ.. మల్యాల రచించిన వెలుగు రవ్వలు ప్రశ్నించే తత్వం ఉన్న పుస్తకమన్నారు. ఈసందర్భంగా వెలుగు రవ్వలు పుస్తకాన్ని కవి మల్యాల మనోహరరావు తన సతీమణికి అంకితమిచ్చారు. తన పాఠశాల గురువైన గంటా రామిరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి, రచయిత మెట్టు మురళీధర్, సహృదయ ప్రధాన కార్యదర్శి ఎన్వీఎన్‌చారి, కుందావఝ్జుల కృష్ణమూర్తి, డా.ఏవీ నరసింహారావు, రాధాకృష్ణ, కళా రాజేశ్వరరావు, నాగిళ్ల రామశాస్త్రి, పొట్లపల్లి శ్రీనివాసరావు, కాంచనపల్లి రాజేందర్, అన్వర్, సహృదయ, సర్వోదయ సభ్యులు పాల్గొన్నారు.

సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి

● తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



మాట్లాడుతున్న తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీసీ రెడ్డి

హన్మకొండ: పని చేస్తున్న సంస్థ అభివృద్ధికి పాటుపడాలని తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బీసీ రెడ్డి అసోసియేషన్ సభ్యులకు సూచించారు. సోమవారం హనుమకొండ విద్యుత్‌నగర్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీసీ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యుత్ సంస్థలు కష్టాల్లో ఉన్నాయని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ఇంజనీర్లుగా మనపై ఉందన్నారు. పీఆర్సీతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించుకున్నామని, ఇక నుంచి మరింత ఉత్సాహంతో పని చేయాలన్నారు. డిప్లొమా ఇంజనీర్స్‌కు అసోసియేషన్ అండగా ఉంటుందన్నారు. అసోసియేషన్‌ను మరింత పటిష్టం చేయాలన్నారు. సమావేశంలో అసోసియేషన్ ఎన్పీడీసీఎల్ శాఖ ప్రధాన కార్యదర్శి నార్ల సుబ్రహ్మణ్యేశ్వర్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నరేశ్, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.నరేందర్, ఎస్పీడీసీఎల్ జనరల్ సెక్రటరి తాజుద్దీన్, అసోసియేషన్ హనుమకొండ జిల్లా కార్యదర్శి మల్లికార్జున్, జనగామ జిల్లా కార్యదర్శి వంశీకృష్ణ, ములుగు, మహబూబాబాద్ జిల్లా కార్యదర్శులు రాజు, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిని చితకబాదిన ఉపాధ్యాయుడు



తల్లిని కొడుతున్న ఉపాధ్యాయుడు ప్రభాకర్

మరిపెడ రూరల్: ‘చనిపోయిన తమ్ముడి కుటుంబానికి చెందిన భూమి లాక్కొని, ఆకుటుంబానికి అన్యాయం చేస్తావారా?’ అని కొడుకును నిలదీసినందుకు కోపోద్రిక్తుడైన కుమారుడు కన్నతల్లిని చితకబాదాడు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గాలివారిగూడెం గ్రామానికి చెందిన చెరుకుపల్లి సూరమ్మ–లాలయ్య (లేట్) దంపతులకు ముగ్గురు కుమారులు. వీరి కుటుంబానికి సర్వే నంబర్ 206/ఈలో 4.18 ఎకరాల భూమి ఉంది. చిన్నకుమారుడు చెరుకుపల్లి అశోక్‌కు ఇద్దరు పిల్లలు కలిగిన తర్వాత అనారోగ్యంతో మృతి చెందాడు. చిన్న కుమారుడి కుటుంబానికి 18 గుంటలు, అన్నదమ్ముల భాగం కింద మరో 10 గుంటలు.. మొత్తం 28 గుంటల భూమిని గ్రామస్తుల ఆధ్వర్యంలో రాసిచ్చారు. ఈభూమిపై కన్నేసిన పెద్ద కుమారుడు ప్రభుత్వ ఉపాధ్యాయుడైన ప్రభాకర్ 28 గుంటల భూమినంతా తన భార్య అయిన వసంత పేరిట పట్టా చేయించుకున్నాడు. ఇటీవల ఈ విషయం బయట పడగా.. తల్లి సూరమ్మ ప్రభాకర్‌ను నిలదీసింది. దీంతో కన్నతల్లి అని చూడకుండా ఉపాధ్యాయుడు ప్రభాకర్ కాలుతో తన్ని చెంపలపై కొట్టి ఈడ్చి కిందపడేశాడు. ‘కష్టపడి చదివించి ప్రయోజకున్ని చేసిన. అయినా.. నన్ను ఇష్టం వచ్చినట్లు కొడుతున్నావ్’ అని సూరమ్మ బోరున విలపించింది. చనిపోయిన చిన్న కొడుకు కుటుంబానికి అన్యాయం జరగకుండా చూడాలని గ్రామస్తులను, అధికారులను ఆ తల్లి వేడుకుంటోంది. ఈవిషయంపై మరిపెడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు సూరమ్మ పేర్కొంది.

డబ్బులిప్పించాలని అర్ధనగ్న ప్రదర్శన



నిరసన తెలుపుతున్న అంజయ్య, ఐలయ్య

తరిగొప్పుల: అప్పుగా ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరితే బీఆర్‌ఎస్ నాయకుడు బెదిరింపులకు పాల్పడుతున్నాడని మండల కేంద్రానికి చెందిన అవుల అంజయ్య, సుంకరి ఐలయ్య వాపోయారు. ఈమేరకు వారు సోమవారం తరిగొప్పుల–చేర్యాల రోడ్డుపై బైఠాయించి అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. ఈవీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు తాళ్లపల్లి పోశయ్య కుమారుడు తాళ్లపల్లి రవి అంజయ్య వద్ద రూ.4 లక్షలు, అయిలయ్య వద్ద రూ.1 లక్ష అప్పుగా తీసుకున్నాడని, తిరిగి ఇవ్వాలని అడిగితే ఐపీ పెట్టి కోర్టు ద్వారా నోటీసులు పంపించాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులిప్పించి న్యాయం చేయాలని, లేదంటే ఆత్మహత్యే శరణ్యమని వారు వాపోయారు. ఈవిషయమై తాళ్లపల్లి పోశయ్యను ఫోన్‌లో సంప్రదించేందుకు యత్నించగా స్విచ్ ఆఫ్ వచ్చింది.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి



చింటు (ఫైల్)

కాజీపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద చికిత్స పొందుతున్న కాజీపేట 62వ డివిజన్ సోమిడి గ్రామానికి చెందిన గిన్నారపు చింటు (28) సోమవారం మృతి చెందాడు. చింటు దాదాపు 3 నెలల క్రితం టేకులగూడెం ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో ద్విచక్ర వాహనంపై వస్తుండగా ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లిన అతడిని ఆస్పత్రిలో చేర్పించగా మెరుగైన చికిత్స కోసం చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ నిమ్స్ ఆసుపత్రికి తరలించడానికి తోడ్పాటును అందించారు. ప్రభుత్వ ఎల్‌ఓసీని ఇప్పించి వైద్యం చేయించారు. చింటు కుటుంబ పరిస్థితి తెలిసిన గ్రామస్తులు, బంధు,మిత్రులు ఆర్థికంగా చేయూతనందించారు. ఇటీవలే కోమాలోంచి బయటకు వచ్చిన చింటు ఇంటి వద్ద ఉండి వైద్యం చేయించుకుంటున్నారు. సోమవారం తీవ్ర అస్వస్థతకు గురైన అతడు మృతి చెందాడు. కుటుంబ సభ్యులతో పాటు బంధు మిత్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

రైలు నుంచి జారి పడి ఒకరు..

జనగామ రూరల్: రైలు నుంచి జారి పడి సోమవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. జీఆర్పీ ఎస్సై సీహెచ్.పరశురామ్ తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ నుంచి విజయవాడకు టికెట్ తీసుకుని వెళ్తున్న ఓ గుర్తు తెలియని (సుమారు 35 నుంచి 45 వయసు) వ్యక్తి రఘునాథపల్లి–జనగామ రైల్వే ట్రాక్ మధ్య గల స్టేషన్ పరిధిలో ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందాడు. మృతుడికి చెందిన ఎలాంటి ఆధారాలు లేవని గుండ్రటి ముఖం, మెడ చేతిపై త్రిశూలం కలిగిన పచ్చబొట్టు, అతడి ఒంటిపై ఆకుపచ్చ డిజైన్ కలిగిన ఫుల్ షర్ట్, నలుపు నీలి రంగు పాయింట్, గల్లాపై మధు టైలర్ జవహర్‌నగర్ హైదరాబాద్ అని రాసి ఉంది. వివరాలకు 94906 19031, 9866 330257 నంబర్లలో సంప్రదించాలని జీఆర్పీ ఎస్సై తెలిపారు.

చేప పది కిలోలు!



కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి మేడిగడ్డలోని లక్ష్మీబ్యారేజీలో సోమవారం మత్స్యకారులకు పదికిలోల చేప చిక్కింది. ఈచేపను మహదేవపూర్‌కు చెందిన బి.శేఖర్ అనే వ్యక్తి రూ.1500కు కొనుగోలు చేశాడు.

మహా జాతరకు ముందస్తుగా పోలీస్‌శాఖ సిద్ధం



జాతర ఏర్పాట్లపై సమీక్షిస్తున్న ఎస్పీ గాష్ ఆలం

ఎస్ఎస్‌తాడ్వాయి: వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న సమ్మక్క–సారలమ్మ మహా జాతరలో పకడ్బందీ ఏర్పాట్లపై పోలీసు శాఖ సిద్ధమవుతోంది. ఈమేరకు సోమవారం మేడారంలోని ఐటీడీఏ అతిథి గృహంలో ఎస్పీ గాష్ ఆలం జాతరలో చేపట్టాల్సిన ఏర్పాట్లు, జాతర విజయవంతంపై పోలీసు అధికారులతో ముందస్తు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆసియా ఖండంలోనే అతి పెద్ద జాతరకు సుమారుగా 2 కోట్ల మంది భక్తులు హాజరవుతారని జాతరలో భక్తుల భద్రత ఏర్పాట్లపై ఎస్పీ సమీక్షించారు. గత మహా జాతరలో పని చేసిన అధికారుల అనుభవాలు, లోటు పాట్లపై సమీక్షించారు. వచ్చే జాతరలో విధులు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఇంకా మెరుగైన సౌకర్యాలపై అంశాల వారీగా చర్చించారు. ప్రధాన రహదారులు భద్రత, మరమ్మతులు, భక్తుల రద్దీ నియంత్రణ, భక్తులకు అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రతలపై సమీక్షించారు. సమావేశంలో అదనపు ఎస్పీ సదానందం, డీఎస్పీ రవీందర్, సీఐ స్పెషల్ బ్రాంచ్ శ్రీనివాస్, సీసీఎస్ సీఐ, రవీందర్, సీఐలు రంజిత్‌కుమార్, శంకర్, కమ్యూనికేషన్ సీఐ రోహిత్, ఆర్ఐ అడ్మిన్ వెంకటనారాయణ, ఆర్ఐ హోంగార్డ్స్ స్వామి, ఎస్ఐలు కర్ణాకర్‌రావు, వెంకటేశ్వరరావు, పవన్‌కుమార్, తాజుద్దీన్, రమేశ్, తాహీర్‌బాబా, పీఎస్ఐ శ్రవణ్‌కుమార్ ఉన్నారు.

చిత్రకారుడిగా గర్విస్తున్నా..

● ఎంపీ పసునూరి దయాకర్
● డ్రాయింగ్ శిక్షణ శిబిరం ప్రారంభం



బొమ్మ గీస్తున్న ఎంపీ దయాకర్

హన్మకొండ చౌరస్తా: ‘బొమ్మలు గీయడం ఓ అద్భుతమైన కళ. నేను ఒక చిత్రకారుడినని చెప్పుకోవడానికి గర్విస్తున్నా’ అని వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ అన్నారు. సాగంటి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో హనుమకొండ కేఎల్ఎన్‌రెడ్డి కాలనీలోని సత్యం పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన డ్రాయింగ్ శిక్షణ శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. సీఎం కేసీఆర్ తనను చిత్రకారుడిగా గుర్తించిన తర్వాతనే ఎంపీగా అవకాశం కల్పించాడన్నారు. అకాడమీ డైరెక్టర్ మంజుల మాట్లాడుతూ.. నెల రోజుల పాటు ప్రతీ రోజు ఉదయం 9 నుంచి 11 వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్, ప్రముఖ రచయితలు మహ్మద్ సిరాజ్, బిల్లా మహేందర్, విద్యావేత్త బూర విద్యాసాగర్‌గౌడ్, ట్రాఫిక్ సీఐ విజయ్ కుమార్, ఆలేటి శ్యాం, స్కూల్ కరస్పాండెంట్ చెరుకు వేణు, దేవిక, రజిత, సంధ్య పాల్గొన్నారు.